## క్లుప్తంగా

### సేవాదళ్ అధ్యక్షుడిగా నరేష్


నియామక పత్రం అందుకుంటున్న నరేష్

సుజాతనగర్: కొత్తగూడెం నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడిగా సుజాతనగర్‌కు చెందిన పూరేటి నరేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని చేతుల మీదుగా నియామకపత్రాన్ని శుక్రవారం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన వారికి నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

### ఈ నెల 18న ఉపాధి పనులపై ప్రజావేదిక

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఈనెల 18న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 36 పంచాయతీల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామస్థాయిలో తనిఖీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో వచ్చిన ఫిర్యాదులు, సమస్యలపై చర్చించడం కోసం ప్రజావేదిక నిర్వహిస్తున్నామని, ఎంపీటీసీలు, పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని తెలిపారు.

### ఎస్సెస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జూలూరుపాడు: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానుండగా, ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈఓ గుగులోతు వెంకట్ తెలిపారు. మండలంలోని జూలూరుపాడు, వెంగన్నపాలెం పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో ఫర్నీచర్, తాగునీటి సౌకర్యం, సీసీ కెమెరాల ఏర్పాట్లపై ఆరా తీశాక ఎంఈఓ మాట్లాడారు. మండలంలో 326 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనుండగా, కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే పరీక్షకు విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే చేరుకోవాలని సూచించారు.

### పంట మార్పిడితో లాభాలు

సింగరేణి(కొత్తగూడెం): యాసంగిలో పంట మార్పిడి చేస్తే లాభాలు పొందొచ్చని, తక్కువ నీటి వసతి కలిగిన రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారిస్తే మంచి ఫలితాలు ఉంటాయని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు నవీన్, శ్రీనివాస్ సూచించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిని చిట్టి రామవరంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. యాసంగిలో నూనెగింజల సాగుతో పంటమార్పిడి చేయాలని, ఆయిల్‌పామ్ సాగుతోనూ లాభాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు డాక్టర్ శ్రీనివాస్, గోపాలరావు, అనూష, కౌన్సిలర్ భుక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ అత్యవసర సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు హాజరుకావాలని కోరారు. పది అంశాల ఎజెండాతో పాటు అత్యవసర సమావేశ నోటీసును కౌన్సిల్ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం, పాపకొల్లు (అన్నారుపాడు), జూలూరుపాడు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం మరమ్మతులు చేపట్టనున్నట్లు విద్యుత్ ఏఈ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### పగిడిద్దరాజు జాతర

ఇల్లెందురూరల్: ముక్తి వంశస్తుల ఇలవేల్పు పగిడిద్దరాజు జాతరను మండలంలోని మర్రిగూడెం పంచాయతీ రామవరం గ్రామంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వనం నుంచి భారీ ఊరేగింపుతో పగిడిద్దరాజు గద్దెల మీదకు చేర్చిన ముక్తి వంశస్తులు సాంప్రదాయ పద్ధతిలో పూజ చేసి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. రాజశేఖర్, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, బానోత్ రోజా, యశోధర, నాయకులు కిన్నెర నర్సయ్య, రాంబాబు పాల్గొన్నారు.

# క్యూ కడుతున్నారు..

**ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్‌లో ఆన్‌లైన్ తప్పిదాలు**

- ఇల్లెందులో ఐదు పథకాలకు 10,373 దరఖాస్తులు
- అర్హులకు జీరో బిల్లులు జారీ కాక మళ్లీ కార్యాలయాలకు..
- మిగతా పథకాల కోసం కూడా ఆందోళన



మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన వినియోగదారులు (ఇన్‌సెట్) జిరాక్స్ కేంద్రం వద్ద..

ఇల్లెందు: ప్రజాపాలన దరఖాస్తుల సమర్పనలో లబ్ధిదారుల అవగాహన లోపమో, పథకాల పట్ల నమ్మకం లేకనో, కంప్యూటరీకరణలో దొర్లిన తప్పిదాల వల్లనో ఆయా పథకాల కోసం మళ్లీ లబ్ధిదారులు అటు ఎంపీడీఓ, ఇటు మున్సిపల్, గ్యాస్ ఏజెన్సీలు, విద్యుత్ శాఖల లైన్‌మెన్, ఏఈల వద్దకు పరుగులు తీస్తున్నారు. నిన్న ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో సగానికి పైగా చిక్కులు వచ్చాయంటూ ఆయా శాఖల వద్దకు వెళ్లి మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. లైన్‌మెన్ ఎదుట ముందుకు వచ్చి బిల్లు కొట్టి చేతిలో పెట్టడమే ఆలస్యం తమకు జీరో బిల్లు రాలేదని, ఏం చేయాలని లబ్ధిదారులు హైరానాకు గురవుతున్నారు.

**కార్యాలయాలకు పరుగులు..**

జీరో బిల్లు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ పత్రాలతో అటు ఎంపీడీఓ, ఇటు మున్సిపల్ కార్యాలయం వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇక కంప్యూటర్ ఆపరేటర్ చేతిలో ఆ జీరో బిల్లు పెట్టిన వెంటనే గ్యాస్ ఏజెన్సీ నుంచి కస్టమర్ నంబర్, కేవైసీ, ఆధార్, మొబైల్ నెంబర్ లింకు చేసుకుని రావాలని సూచిస్తుండటంతో అక్కడి నుంచి గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్తున్నారు. మరోపక్క బ్యాంక్ అకౌంట్లకు ఆధార్, మొబైల్ లింకు చేసుకుని రావాలంటుండటంతో బ్యాంకుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. అంతేకాక ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ఆధార్ కార్డులు తెలంగాణ పేరుతో ఉండాలని, ఆధార్ కార్డులను మొబైల్ నంబర్‌తో లింకు చేసుకుని ఉండాలని సూచిస్తున్న తరుణంలో మీ సేవా కేంద్రాల వద్దకు ఆధార్ అప్‌డేట్ కోసం బారులు దీరుతున్నారు. ఇల్లెందులోనే నాలుగు కేంద్రాలు ఉండటం, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లిలో లేకపోవటంతో తెల్లారుజామున నుంచి కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. ఇలా ఏ కార్యాలయం వద్ద చూసినా లబ్ధిదారులు బారులు దీరుతున్నారు.

**గ్యారంటీల కోసం హైరానా..**

పక్క రాష్ట్రం ఆంధ్రాలో ఇంటి ముందుకు వలంటీర్ వచ్చి అన్ని అక్కడే అప్‌డేట్ చేసుకుని ఏ లబ్ధిదారుడు కూడా కార్యాలయాల చుట్టూ తిరగకుండా పనులు సాగిపోతుండగా తెలంగాణలో మాత్రం ఆరు గ్యారంటీలు అమలు పొందాలంటే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. దీంతో పాటు ఆధార్ అప్‌డేట్‌కు మీ సేవా కేంద్రాలకు, బ్యాంకు అకౌంట్‌కు ఆధార్, మొబైల్ లింకు కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఇక రేపో మాపో మహిళలకు రూ.2,500, ఇందిరమ్మ ఇళ్లు పథకాలు అమలులోకి వస్తున్నాయంటే వాటి కోసం అటు హౌజింగ్, ఇటు ఏకేపీ, మెప్మా, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలతో పాటు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చే అవకాశం లేకపోలేదు. అవగాహన లేని నిరక్షరాస్యులు తీవ్రంగా హైరానాకు గురవుతున్నారు.

**ఇల్లెందులో ఇలా..**

ప్రజాపాలనలో పట్టణంలోని 24 వార్డుల్లో 10,373 దరఖాస్తులు ఐదు గ్యారంటీలకు, ఇతర సమస్యలకు 1,338 దరఖాస్తులు అందజేశారు. ఆయా పథకాలకు ఏ కారణం చేతనైనా అందని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో ఆన్‌లైన్ తప్పిదాలు, ఏమరపాటుతో జరిగిన నష్టాలతో ఆయా పథకాలు వర్తింపునకు నోచుకోకపోవటంతో మళ్లీ దరఖాస్తుల కోసం క్యూ కడుతున్నారు. ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటంతో ఆటో, జిరాక్స్ చార్జీలు రోజుల తరబడి వేచి ఉండటం వల్ల అసౌకర్యానికి గురవుతున్నారు. పథకాల పట్ల ఏవగింపు వస్తోందని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

**దరఖాస్తులు మళ్లీ స్వీకరించాలి..**



గతంలో జరిగిన సభల్లో కొందరు దరఖాస్తులు ఇవ్వలేకపోయ్యారు. అలాంటి వారి కోసం కనీసం కార్యాలయంలో మళ్లీ దరఖాస్తులు స్వీకరించాలి. ఎంతో మంది అర్హత కలిగిన వారికి ఈ పథకంలో దొర్లిన తప్పిదాల వల్ల నష్టం జరుగుతోంది. అలా జరగకుండా అధికారులు చొరవ తీసుకోవాలి.
– ఆలేటి కిరణ్, వినోభానగర్, ఇల్లెందు

**ఇంటింటికీ పరిశీలన చేయాలి..**



దరఖాస్తుల్లో తప్పిదాలు దొర్లి అర్హులకు జాబితాలో చోటు లభించలేదు. దీంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ప్రభుత్వం మళ్లీ ఇంటింటికి వెళ్లి అర్హులైన వివరాల సేకరించాలి. అలా చేయకపోతే ప్రజలు కార్యాలయాలు, జిరాక్స్ సెంటర్ల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోతారు.
– ఏ.సాంబ, నెంబర్–2 బస్తీ, ఇల్లెందు

# క్రమశిక్షణే ఉన్నతికి సోపానం

- ఎమ్మెల్యే కోరం కనకయ్య


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, చైర్మన్ వెంకటేశ్వరరావు

ఇల్లెందురూరల్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకునేందుకు అదే సోపానమవుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని కొమ్ముగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టేషనరీ సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు పరీక్ష సమయంలో తోడ్పాటు అందిస్తున్న రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అభినందనీయులని ప్రశంసించారు.

**వాలీబాల్ పోటీలు ప్రారంభం..**

మండలంలోని మర్రిగూడెం పంచాయతీ రామవరం గ్రామంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాలలో యువత క్రమం తప్పకుండా వాలీబాల్‌పై ఆసక్తితో సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారని గుర్తుచేశారు. వేసవిలో యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని మరింతగా సాధన చేసి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, తాటి యశోద, దనసరి శాంత, పీఏసీఎస్ డైరెక్టర్ కిన్నెర నర్సయ్య, మాజీ సర్పంచ్ సూర్నపాక రామయ్య, ప్రధానోపాధ్యాయుడు రవి, రీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, నాయకులు బానోత్ రాంబాబు, తాటి రాంబాబు, నాగార్జున్, భార్గవ్ పాల్గొన్నారు.

**రేపు నియోజకవర్గ సమావేశం**

ఇల్లెందు: మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క– సారక్క గద్దెల వద్ద గల ఎస్ఎస్ గార్డెన్స్‌లో ఆదివారం కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోని ఇల్లెందు నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు, ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ అత్యధికంగా ఓట్లు పొందేలా ప్రణాళిక రూపొందించుకునేందుకు సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

# క్షయ వ్యాధి నివారణే లక్ష్యం


శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

టేకులపల్లి: 2025 చివరికల్లా క్షయ వ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మనోహర్ రెడ్డి, టీబీ నోడల్ ఆఫీసర్ నాగుబండి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని సులానగర్ పీహెచ్‌సీలో శుక్రవారం వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణలో వారు మాట్లాడారు. చిన్నపిల్లల్లో క్షయ వ్యాధిని గుర్తించడంలో వైద్య శాఖ, ఐడీసీఎస్ ఉద్యోగులు శ్రద్ధ కనబర్చాలని తెలిపారు. క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకుని బాధితులను గుర్తించి చికిత్స ఇప్పించడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చనిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ప్రభాకర్, వజ్జ పార్వతి, పోరండ్ల శ్రీనివాస్, విజయ, వీసం శకుంతల, అనురాధ, నిర్మల, లక్ష్మి, సక్కుబాయి, యశోద పాల్గొన్నారు.

# ప్రజలను చైతన్యపర్చాలి


కొత్తగూడెంరూరల్: సమావేశంలో మాట్లాడుతున్న సాయిరమేష్


పాల్వంచరూరల్: మాట్లాడుతున్న చిన్నప్పయ్య

కొత్తగూడెంరూరల్: కొనుగోలు చేసే ప్రతీ వస్తువుపై వ్యాపారుల దగ్గర నుంచి బిల్లులు తీసుకునే విధంగా ప్రజలను చైతన్య పర్చాలని కన్స్యూమర్ రైట్స్ వ్యవస్థాపకులు సాయిరమేష్ అన్నారు. శుక్రవారం వరల్డ్ కన్స్యూమర్ డే సందర్భంగా లక్ష్మీదేవిపల్లి చాతకొండలో జరిగిన కార్యక్రమంలో సాయిరమేష్ మాట్లాడారు. నాణ్యమైన వస్తువులు పొందలేకపోతే కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ శ్యామ్‌కుమార్, మల్లెల ఉషారాణి, రాష్ట్ర చైర్మెన్ నాగుబండి రమేష్, వైస్ చైర్మన్ వసంతి, కమిటీ మెంబర్ నాజియా, చంద్రకళ, లింగేష్, తదితరులు పాల్గొన్నారు.

**బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి**

పాల్వంచరూరల్: దుకాణాల్లో ఏ వస్తువు కొనుగోలు చేసినా వినియోగదారులు తప్పకుండా బిల్లు తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల క్లబ్ ఇన్‌చార్జ్ కోటగిరి రాంబాబు, అరుణ కుమారి, వెంకటేశ్వరరావు, పూర్ణచందర్‌రావు, విజయ్‌కుమార్, కార్తీక్, శ్రీనివాస్, స్వరూపరాణి, శ్రీదేవి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంచి ప్రవర్తనతో ఉన్నత స్థానం


మాట్లాడుతున్న జీఎం షాలేంరాజు

కొత్తగూడెంఅర్బన్: మంచి నడవడిక, ప్రవర్తనలు సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెడతాయని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ షాలేంరాజు అన్నారు. శుక్రవారం కొత్తగుడెం మున్సిపాలిటీ పరిధి రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రామవరం ప్రభుత్వ పాఠశాలలో చదివి క్రమశిక్షణతో జనరల్ మేనేజర్ స్థాయిలో ఉన్నానన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులందరికి పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దయాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### సమస్యలను అధిగమించాలి


మాట్లాడుతున్న సైబర్ క్రైం సీఐ జితేందర్

కొత్తగూడెంఅర్బన్: మహిళలు తమ సమస్యలను అధిగమించి ముందుకెళ్లాలని సైబర్ క్రైం సీఐ ఎస్.జితేందర్ తెలిపారు. శుక్రవారం గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ప్రస్తుతం సమాజంలో మహిళలు ఏ విధంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు, వాటిని ఏ విధంగా పరిష్కరించుకోవాలనే వాటిపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ బి.రాజేశ్వరి, సైబర్ క్రైం పోలీసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కుక్కలు, కోతుల బెడద అరికట్టాలి

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలను భయాభ్రంతులకు గురి చేస్తున్న కుక్కలు, కోతులను పట్టించి, అడవుల్లో దూరంగా విడిచిపెట్టాలని 23వ వార్డు కౌన్సిలర్ వై.శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వార్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూలీలైన్‌లో కోతులు, కుక్కలు బెడద తీవ్రంగా ఉందని, ఇళ్లలో చొరబడి రేకులు పగలగొట్టి వస్తువులు చిందర వందర చేస్తూ వృద్ధులపై, ప్రజలపై, పిల్లలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయన్నారు. అనంతరం కోతుల దాడిలో గాయపడిన ఆటో డ్రైవర్ దాసరి వెంకన్నను వారింటికి వెళ్లి పరామర్శించారు.

### వైద్యశిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

జూలూరుపాడు: మండలంలోని కొత్తూరు పంచాయతీ పెద్దహరిజనవాడ గ్రామంలో శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రజలకు వైద్య పరీక్షలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి, చైతన్య పరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాధిక, ఏఎన్ఎం తార, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### సొంత ఇంటి పథకం అమలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని శుక్రవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ పా ఎన్‌వీకే శ్రీనివాస్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, బ్రాంచి కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ... ఈ పథకం అమలు చేయడంతో కంపెనీపై ఎలాంటి ఆర్థిక భారం పడదని, దానికి సంబంధించిన పూర్తి వివరాలను వారు అందజేశారు. వివిధ ఏరియాల్లో ఉన్న కంపెనీ ల్యాండ్ వివరాలు, శిథిలావస్థలో ఉన్న కంపెనీ క్వార్టర్ల వివరాలు పూర్తి సమాచారం అందించి చర్చించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ సూచనలను సీ అండ్ ఎండీ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

### ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ


పత్రికలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

పాల్వంచ: పట్టణ పరిధిలోని గుడిపాడులోని శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న స్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను శుక్రవారం శ్యామల గోపాలన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సభ్యులు నల్లా రామిరెడ్డి ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఆరేం ప్రశాంత్, వెంకటేశ్వర రెడ్డి, సోయం సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ శ్రీను, కోరం రమేశ్, కృష్ణారావు, తిరుమల రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అక్రమం

ఇల్లెందు: ఎమ్మెల్సీ కవితను ఢిల్లీ కేసులో ఈడీ, ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సుప్రీం కోర్టు తీర్పు ఉన్నా అకస్మాత్తుగా అధికారులు చట్టాలను ఉల్లంఘించి లోకల్ పోలీసుల అనుమతి లేకుండా లోకల్ కోర్టులో ప్రవేశపెట్టకుండా తరలించేందుకు యత్నించటం దుర్మార్గమన్నారు. ఇలాంటి సంఘటనను ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు.

### స్టేషనరీ సామగ్రి పంపిణీ


సామగ్రి పంపిణీ చేస్తున్న వంశీ, తదితరులు

ఇల్లెందు: పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పేన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. శుక్రవారం ఇల్లెందు మొయిన్‌రోడ్ హైస్కూల్‌లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో అందజేశారు. చాందావత్ రమేష్‌బాబు, దాసరి గోపాల కృష్ణ, నర్సయ్య, శ్యామ్, శ్రీవేద్, వినీత్, చింటూ, శ్యామ్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్డీ నేతలపై కేసు అప్రజాస్వామికం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: న్యూడెమోక్రసీ లీగల్ నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం ఆయుధాల చట్టంతోపాటు పూసపల్లి కుట్ర కేసు నమోదు చేయడం అప్రజాస్వామికమని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ అన్నారు. ప్రభుత్వం కుట్రపూరితంగా పార్టీ నాయకులపై అక్రమ పద్ధతిలో కేసులు పెడుతోందని ఆరోపిస్తూ ప్రచార పోస్టర్‌ను శుక్రవారం మండలంలోని కొల్లాపురం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం న్యూడెమోక్రసీని లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు.

### పెరిక కార్పొరేషన్ నిర్ణయంపై హర్షం


మాట్లాడుతున్న యర్రంశెట్టి ముత్తయ్య

పాల్వంచ: పెరిక కులానికి కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని పెరిక సంఘం నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, నాయకులు నాయకులు ఉమా మహేశ్వరరావు, బరపటి ప్రసాదరావు, బాలిశెట్టి లింగయ్య, రంగారావు, బాను, విజయ్, కోటిలింగం, సోమయ్య, శ్రీను, యర్రంశెట్టి మధు తదితరులు పాల్గొన్నారు.

# పోషణ లోపాన్ని అధిగమిద్దాం..


ఇల్లెందురూరల్: పౌష్టికాహారంపై అవగాహన..


టేకులపల్లి: చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లక్ష్మి

ఇల్లెందురూరల్: ప్రతి ఒక్కరూ విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మిప్రసన్న అన్నారు. మండలంలోని విజయలక్ష్మినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులకు మంచి ఆరోగ్యాన్ని అందించడానికి అంగన్‌వాడీ పాఠశాలల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సూపర్‌వైజర్ కొమరమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కారం పద్మ, అంజలి మేరీ, ఉమ, సుమతి, శ్రీలత పాల్గొన్నారు.

టేకులపల్లి: పోషకాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు గంగారం సూపర్‌వైజర్ లక్ష్మీ తెలిపారు. ఈ మేరకు గంగారం సెక్టార్‌లో పరిధిలోని శంభునిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలతో లాభాలు, లభించే పోషకాలను తెలియజేశారు. ఆరు నెలల నిండిన పిల్లలకు అనుబంధ పోషకాహారం ఎలా ఇవ్వాలి వాటిని అవగాహన కల్పించారు.

### ఏడాదికే పగుళ్లు..!


పగుళ్లు ఏర్పడిన గొల్లగూడెం రోడ్డు

సుజాతనగర్: సుజాతనగర్, గొల్లగూడెం గ్రామాల మధ్య గతేడాది నిర్మించిన సీసీ రోడ్డుకు పగుళ్లు ఏర్పడ్డాయి. పనుల్లో నాణ్యత లోపించి ఏడాది తిరగక ముందే గుంతలు తేలాయి. రోడ్డు సౌకర్యం కోసం ప్రజలు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు అంగన్‌వాడీ కేంద్రం నుంచి గొల్లగూడెం వరకు రూ.20 లక్షల వ్యయంతో గత ఏడాది సీసీ రోడ్డును నిర్మించారు. రోడ్డు నిర్మించి ఏడాదైనా కాలేదు... అప్పుడే పగుళ్లు, గుంతలు ఏర్పడ్డాయి. నాలుగు కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్డు ఏడాదికే పగుళ్లు రావడం ఏంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.